క్లుప్తంగా

ఈ నెల 10తో ముగియనున్న దరఖాస్తు గడువు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మోడల్ స్కూల్లో ప్రవేశానికి గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. 6వ తరగతితో పాటు 7–10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం గత నెల 28వ వరకు గడువు ఉండగా, ఆ గడువును మార్చి10 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 125 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా ఇంద్రసేన్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల ప్రత్యేకాధికారిగా ఇంద్రసేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మాల్తుమ్మెద విత్తనక్షేత్ర ఏడీఏ ఇంద్రసేన్ డిప్యుటేషన్‌పై గతంలో బిచ్కుంద ఏడీఏగా వెళ్లారు. ఇటీవల ఆయన డిప్యుటేషన్ రద్దు కావడంతో ఆయన విత్తనక్షేత్రానికి తిరిగి వచ్చారు. దీంతో ఆయనను నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిగా నియమించారు. ఈ మేరకు నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, జూనియర్ అసిస్టెంట్ అరుణ్ ఉన్నారు.

రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్‌గా జైపాల్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన జైపాల్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్ కామారెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కామారెడ్డి క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి, సభ్యులు డాక్టర్ బాలరాజు, ధనుంజయ, బాలకిషన్, సత్యనారాయణ, విజయ్‌కుమార్ ఉన్నారు.

'వారానికి రెండు రోజులే చెత్త బండి వస్తోంది'

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని 8వ వార్డు సరంపల్లి జీఆర్ కాలనీలో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తబండి వారానికి రెండు రోజుల మాత్రమే వస్తుందని, దీంతో చెత్తను గత్యంతరం లేక కొందరు పక్కనే వాగులో పారేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అన్నారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని జీఆర్ కాలనీవాసులు కోరుతున్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షల కోసం ఎంపిక చేసిన బాలుర ఉన్నత పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలలను శుక్రవారం మండల విద్యాధికారి షౌకత్‌అలీ పరిశీలించారు. సెంటర్లలో వసతులను పరిశీలించారు. ఈ నెల 21 నుంచి జరుగబోయే పదవ తరగతి పరీక్షలకు సెంటర్లు అనుకూలంగా ఉన్నాయా.. లేదా విద్యార్థులకు తాగు నీరు, టాయిలెట్లు, గదులలో ఫ్యాన్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయడానికి అన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ వెంకట్రాములు, సీఆర్పీ గంగాధర్ తదితరులు ఉన్నారు.

నర్సరీలపై షేడ్‌నెట్ల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలపై శుక్రవారం అధికారులు షేడ్‌నెట్లను ఏర్పాటు చేశారు. 'సాక్షి'లో ఈ నెల 7న 'వాడిపోతున్న మొక్కలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మండలంలోని గోపాల్‌పేటతోపాటు ఇతర గ్రామాల్లోని నర్సరీలపై అధికారులు షేడ్‌నెట్లను ఏర్పాటు చేయించారు. గోపాల్‌పేటలో షేడ్‌నెట్ ఏర్పాటు చేసిన నర్సరీని మండల ప్రత్యేకాధికారి ఇంద్రసేన్, ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. నర్సరీలో మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని పంచాయతీ కార్యదర్శి కిష్టయ్యను వారు ఆదేశించారు.

ఎస్సీ కులాలకు వర్గీకరణ ఫలాలు అందాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎస్సీలలోని అన్ని కులాలకు వర్గీకరణ ఫలాలు అందాలని ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ కులాల వారీగా జనాభా ప్రాతిపదికన ఏ, బీ, సీ, డీగా వర్గీకరించి చట్టం చేయాలని అన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిటీ లోపాలను సరిచేయాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు శివానందం, పద్మారావు, నరేష్, కిషన్‌లున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లాలో పలు చోట్ల శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేషంగా రాణిస్తున్న, సేవలందిస్తున్న మహిళలను శాలువాలతో సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ..స్త్రీలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని అన్నారు. మహిళల సాధికారతకు విద్య మూలస్తంభమన్నారు. చదువు, బాలికల ఉన్నతికి మార్గం అవుతుందని వ్యాఖ్యానించారు. మహిళలంటేనే ఓర్పు, సహనం అని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు సన్మానం



జిల్లా కేంద్రంలో ఎంవీఐ నాగలక్ష్మిని సన్మానిస్తూ..



బీబీపేట బాలికల పాఠశాలలో..



మద్నూర్‌లో మహిళా ఉద్యోగికి సన్మానం



ఎల్లారెడ్డి ఐసీడీఎస్ కార్యాలయంలో..



లింగంపేట: మహిళలతో శెట్పల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం వసుధ, ఎంఈవో షౌకత్ అలీ



దోమకొండలో మహిళా ఉపాధ్యాయులకు..



బాన్సువాడలో తపస్ ఆధ్వర్యంలో ..



గాంధారి రైతు వేదికలో ..



నాగిరెడ్డిపేటలో..

గురువులను దేవుడిలా భావించాలి

- స్వామి నరేంద్రాచార్య మహరాజ్

నిజాంసాగర్(జుక్కల్): హిందూ ధర్మం ప్రకారం గురువులను దేవుడిలా భావిస్తూ, గురుమార్గంలో భక్తులు దైవ చింతన చేయాలని జగద్గురు రామానందచార్య శ్రీ స్వామి నరేంద్రాచార్య మహరాజ్ అన్నారు. శుక్రవారం జుక్కల్ మండలం దోస్త్‌పల్లిలోని తెలంగాణ ఉప పీఠంలో ఆయన భక్తులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు చేస్తూ.. హిందూధర్మాన్ని ఆచరిస్తూ భక్తి మార్గంలో మోక్షం పొందాలన్నారు. గురు దీక్ష తీసుకున్న వారు జీవితంలో సుఖం వచ్చినప్పుడు సంతోషపడకూడదు.. దుఃఖం వచ్చినప్పుడు బాధపడకూడదని చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దోస్త్‌పల్లిలోని తెలంగాణ ఉపపీఠంలో నరేంద్రాచార్య మహరాజ్‌ను శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యేను నరేంద్రాచార్య.. శాలువాతో సన్మానం చేసి ఆశీర్వదించారు.



ఆశీర్వాదం తీసుకుంటున్న జుక్కల్ ఎమ్మెల్యే

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



కామారెడ్డి క్రైం: రంజాన్ మాసం సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్సైలు, సిబ్బంది, పట్టణానికి చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనులు చేయాలి

లింగంపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ కూలీలు.. పనులు చేయాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. శుక్రవారం ఆయన ఒంటర్‌పల్లి శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు చేపడుతున్న ఫాం పాండ్ పనులు కొలతల ప్రకారం చేయాలని ఆదేశించారు. ఎండల తీవ్రత పెరగడంతో కూలీలు ఉదయం తొందరగా వచ్చి పనులు చేయాలని సూచించారు. కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మస్టర్లను పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి అంజిబాబు ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేశ్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): చిన్న తక్కడ్‌పల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శామప్ప పటేల్, సాయి రెడ్డి, నాగనాథ్ పటేల్, పండరి, వినోద్, హన్మాండ్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

దోమకొండ: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా క్యాంటీన్‌ను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు. మండలంలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులతో చర్చించారు. మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సిబ్బంది మనోహర్, శ్రీకాంత్ తదితరులున్నారు.



ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో చందర్‌నాయక్

సైన్స్‌పై అవగాహన ఉండాలి



కామారెడ్డి రూరల్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామిరెడ్డి సూచించారు. దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రయోగాలను తిలకించి విద్యార్థుల వివరణలను తెలుసుకున్నారు. బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, సైన్స్ ఉపాధ్యాయులు మానస, శ్రీనివాస్, సాయిలు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్యలకు అవార్డులు

దోమకొండ/భిక్కనూరు/రాజంపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో భిక్కనూరు మండల సమాఖ్యకు జిల్లా స్థాయి మొదటి అవార్డు, రాజంపేట, దోమకొండ మండల సమాఖ్యకి ద్వితీయ అవార్డు దక్కింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సమాఖ్య సభ్యులు ఈ అవార్డును అందుకున్నారు. 2024– 25 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా వంద శాతం రుణాలు అందజేయడం, రికవరీ సక్రమంగా చెల్లించడం, పాడి గేదెలు, పెరటి కోళ్లు, మైక్రో ఎంటర్ ప్రైజెస్‌ల ద్వారా రుణాలు అందించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు ఈ అవార్డు అందుకున్నారు.



జిల్లా కలెక్టర్‌తో దోమకొండ, రాజంపేట, భిక్కనూరు మండలాల సమాఖ్య సభ్యులు

సంక్షిప్తం

బాధితులకు పౌష్టికాహారం అందజేత

కామారెడ్డి అర్బన్: శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వర్డ్ సంస్థ గుర్తించిన ఆర్థి కంగా, ఆరోగ్యంగా బాగాలేని దీన పరిస్థితి లో ఉన్న నలుగురు ఎయిడ్స్ బాధితులకు ట్రస్ట్ అధ్యక్షుడు ఎంజీ చక్రవర్తిగౌడ్ నిత్యావసర వస్తువులు, పౌష్టికాహార వస్తువులు అందజేశారు. సాయిచారిటబుల్ ట్రస్ట్ కార్యద ర్శి భగత్, 'వర్డ్' ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎక్స్‌గ్రేషియా చెక్కు..

రామారెడ్డి: మద్దికుంటకు చెందిన గజ్జల లింగం గతంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మరణించగా.. విద్యుత్ శాఖ ఎక్స్‌గ్రేషి యా కింద రూ.5 లక్షల చెక్కును శుక్రవారం విద్యుత్ అధికారులతో కలిసి రామారెడ్డి మా జీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు కల్లూరి రఘోత్తంరెడ్డి, రెడ్డి నాయక్, బండి ప్రవీణ్, దుంపల బాలరాజు, పెండ్యాల నర్సారెడ్డి పాల్గొన్నారు.

నలుగురికి చెక్కుల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. లింగంపేటకు చెందిన బొల్లు సత్యనారాయణకు రూ. 60 వేలు, తాటి పాముల భాగ్యకు రూ.60 వే లు, భాస్కర్‌గౌడ్‌కు రూ.56 వేలు, ఆకుల సంతోష్‌కుమార్‌కు రూ.44 వేలు విలువ గ ల చెక్కులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): భూంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడు హన్మంతొల్ల బాల్‌కిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాల కల్పనకు కృషి'



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హామీ ఇచ్చారు. శుక్రవారం కల్వరాల్ ఉన్నత పాఠశాలలో వజ్రోత్సవ వేడుకలకు హాజరై మాట్లాడారు. అరవై ఏళ్ల తర్వాత పాఠశాలలో వేడుకలు జరుపడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరిన పూర్వ విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ గదిని ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డిని అభినందించారు. మండల పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్, మాజీ వైస్ ఎంపీపీ రూపేందర్ రెడ్డి, విండో చైర్మన్లు సదాశివరెడ్డి, గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధి పనులకు పెద్దపీట

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్) : సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామాల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ, గున్కుల్, తుంకిపల్లి, గాలీపూర్, ముగ్దుంపూర్, తెల్గాపూర్ గ్రామ పంచాయతీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిజాంసాగర్ మండలంలో ఫిష్ మార్కెట్‌తో పాటు ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడంతో పాటు ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. ప్రతీ గ్రామం, గిరిజన తండాల్లో సిమెంట్ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపడుతామన్నారు. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, కుల సంఘాలకు కమ్యూనిటీ భవనాలకు సీడీపీ కింద నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. నీటి సమస్య నివారణ కోసం అవసరమైన బోర్లు, మోటార్లను సిద్ధం చేయిస్తామని చెప్పారు. పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, మహమ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు, నాయకులు రమేష్ యాదవ్, లోక్యానాయక్, సవాయిసింగ్, నాగబూషణంగౌడ్, కాలిక్, తోట రాజు, తదితరులు ఉన్నారు.



తెల్గాపూర్‌లో సీసీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కామారెడ్డి టౌన్ : చట్టాలు, హక్కులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా కోర్టు న్యాయమూర్తి టి.నాగరాణి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్ స్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నెంబర్ 15100కి కాల్ చేయాలన్నారు. సమానత్వ హక్కులు, మహిళా సాధికారత గురించి తెలిపారు. సమయాన్ని వృథా చేయొద్దని, డ్రగ్స్‌కు బానిస కాకుండా లక్ష్యాలను అధిగమించాలని కోరారు. స్కూల్ డైరెక్టర్ జ్యోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి నాగరాణి

ఆధ్యాత్మికం..

విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం



బాన్సువాడ: బాన్సువాడలోని గౌలీగూడలో శుక్రవారం హనుమాన్, శివ, రుక్మిణీ విఠలేశ్వర, నంది, నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభించారు. ఆర్యక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఉదయం మహిళలు బోనాలతో ఆలయానికి ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

కోచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు..

నసురుల్లాబాద్: మైలారం శివారులోని కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ... కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అన్నారు. అనంతరం సహపంక్తిభోజనాలు చేశారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

బాన్సువాడ: తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి- పుష్పమ్మ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. సింహ వాహనంపై మాఢ వీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. కల్యాణ మహోత్సవానికి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆలయ కమిటీ సభ్యులు పోచారం శంభూరెడ్డి దంపతులు హాజరయ్యారు.



కనులపండువగా విగ్రహాల ప్రతిష్ఠ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మేజర్‌వాడిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి, మల్లికార్జునస్వామి ఆలయాల్లో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమానికి తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేదపండితులు దిగంబరశర్మ ఆధ్వర్యంలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

బోరుబావులకు కెపాసిటర్లను బిగించుకోవాలి



రామారెడ్డిలో పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు



మోతెలో..

- విద్యుత్ శాఖ డీఈ కల్యాణ్ చక్రవర్తి

రామారెడ్డి/మాచారెడ్డి: రైతులు బోరుబావులకు కెపాసిటర్లను బిగించుకోవాలని కామారెడ్డి డివిజనల్ ఇంజినీర్ కల్యాణ్ చక్రవర్తి సూచించారు. రామారెడ్డి, పాల్వంచ మండలాలలో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం రైతులతో కలిసి పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ..బోరు బావుల వద్ద విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్లాస్టిక్ స్టార్టర్ బాక్స్ వాడాలని సూచించారు. దీనివల్ల ఎప్పుడైనా స్టార్టర్ బాక్స్‌కి ఎలక్ట్రికల్ వైర్ తెగిపోయినా ప్రమాదం జరిగే అవకాశం ఉండదని చెప్పారు. బోరు మోటారులకు వాడే సర్వీస్ వైరు కూడా నాణ్యమైన కేబుల్‌ను వాడాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలుంటే విద్యుత్ సిబ్బందితోనే పనులు చేయించుకోవాలని కోరారు. అధికారులు నరేష్ కుమార్, ఏఈ లక్ష్మీనరసింహ, రామారెడ్డి లైన్ ఇన్‌స్పెక్టర్ యేసు రత్నం, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

మోతె గ్రామంలో పొలంబాట

లింగంపేట(ఎల్లారెడ్డి): బోరుబావుల వద్ద కెపాసిటర్లు బిగించుకోవాలని ఏడీ మల్లేశ్ సూచించారు. శుక్రవారం మోతె గ్రామంలో విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలు, విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ క్షేత్రాల్లో వంగిన స్తంభాలను సరిచేశారు. ఏఈ సాయినాథ్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

మొక్కలకు నీళ్లు పట్టాలి

మాచారెడ్డి: నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని పాల్వంచ మండల ప్రత్యేక అధికారి ఎం.సతీష్ యాదవ్ సూచించారు. వాటరింగ్ డే సందర్భంగా ఆయన మొక్కలకు నీళ్లు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలు, ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి రవి ఉన్నారు.

